# అమ్మా! నీ గొంతు ఇంకోసారి వినిపించవా!

డిసెంబరు నెలలో అది ఒక ఆదివారం. మధ్యాహ్నం భోజనం తర్వాత దాదాపు ఒక గంటసేపు దివ్యంగా నిద్రపోయి... మూడున్నర గంటలప్పుడు సికింద్రాబాదు క్లబ్‌కు తన ప్రీమియర్ పద్మినీ కారులో బయలుదేరాడు రఘురామ్ ప్రసాద్. చలికాలం సాయంత్రం ఎండకు ప్రత్యేకమైన ఒక సుఖం వుంటుంది. అదీ కాకుండా నాలుగు గంటలప్పుడు ఎక్కువమంది టెన్నిస్ కోర్టుకు రారు. ఒకటి లేదా ఒకటిన్నర గంటసేపు ''సింగిల్స్'' ఆడడానికి అవకాశం రావచ్చు.

అనుకున్నట్టే, గంటన్నరసేపు 'సింగిల్స్' ఆడాడు. బాగా చెమటపట్టింది. కొద్దిసేపు విశ్రాంతి తీసుకొని, ఒక కప్పు వేడి టీ త్రాగి, తన బేగంపేట ఇంటికి బయలుదేరాడు. ప్యారడైజ్ జంక్షన్ ట్రాఫిక్ లైటు దగ్గరకు వచ్చేసరికి తిన్నగా వెళ్లే వాహనాలకు పెద్ద 'క్యూ' వుంది. ఆకుపచ్చ లైటు వెలుగగానే, వాహనాలన్నీ ముందుకు కదిలాయి. రఘురామ్ ప్రసాద్ కూడా తన కారును మొదటి గేర్‌లో మెల్లగా ముందుకు పోనిచ్చాడు. ఆ కారుకు ముందున్న కారు ట్రాఫిక్ లైను దాటడంతోనే ఆరెంజ్ లైటు వెలిగింది. కావాలంటే రఘురామ్ కూడా దాటి వెళ్లడానికి సమయముంది. కాని ఆ ''క్రిటికల్'' మూమెంట్‌లో కారు ఇంజన్ దానంతట దే ఆగిపోయింది. ఆ కారు లక్ష్మణరేఖ దాటి వుంది. కావాలంటే ట్రాఫిక్ కానిస్టేబుల్ వచ్చి రూ. 150/-లు జుల్మానా విధించే నిషిద్ధ స్థానంలో ఆ కారునిలబడి వుంది. ముందుకాళ్లు ఎత్తేసి నిలబడిన గుర్రంలాగా ఆరెంజ్ లైటు చూసి కారు

ఆగిపోయినసందర్భంలో వెనక నుంచి ఒక కారు హారన్ విపరీతంగా మోగింది. మళ్ళీ ఆకుపచ్చ లైటు వచ్చేవరకు హారన్ ఆగకుండా మోగిస్తూ ఒక తెల్ల మారుతీకారు అతని కారును ఎడమ వైపు నుంచి 'ఓవర్ టేక్' చేయటం జరిగింది. ఓవర్‌టేక్ చేసే సమయంలో ఆ మారుతీ కారు నడుపుతున్న అత్యాధునిక స్టైల్ గల అమ్మాయి రఘురామ్‌వైపు చూసి ''గాడిద కొడకా'' అని ఉరుముతూ వెళ్లడం జరిగింది. తనను తిట్టిన తర్వాత చాలా వేగంగా ఆమె పారిపోతున్నట్టు అతనకి అర్థమైంది. తన ప్రీమియర్ కారుకు, ఆ మారుతీ కారుకున్నట్టు మారుతి వేగం లేదని ఆమె అనుకుంటుదేమో! అతను కూడా తన కారు స్పీడు పెంచాడు. బేగం పేటలో మలుపు తిరగడానికి వున్న స్థలంలో తిరగకుండా ఆ మారుతీకారు సరాసరి వెనుకకి స్టడీగా పెట్టుకొని అతను నడుపుతున్నాడు. ఆ మారుతీకారు ముందు సీటులో, కారు నడిపే అమ్మాయే కాకుండా, ఆ అమ్మాయి వయసుగల ఇంకొక అమ్మాయి కూడా వుంది. వాళ్ల డ్రైవరు, క్లీనరు కావచ్చనుకొని, అతను ఒక చిరునవ్వు నవ్వాడు. ఏమైనా గూడా, ఆ క్లీనరుకు కొంచెం గుబులు ఎక్కువ వున్నట్టుగా వుంది. మాటిమాటికి వెనుక వైపు చూపి, తన డ్రైవరు స్నేహితురాలితో ఏదో సలహా ఇస్తున్నట్టు కనబడుతూంది. అప్పుడప్పుడూ ఆ మారుతీ కారును ఓవర్‌టేక్ చేయటానికి ప్రయత్నం చేస్తున్నట్టు ఆయన నటిస్తున్నప్పుడు 'సైడు' ఇవ్వకుండా వుండడానికి ఆ డ్రైవిణి కూడా ప్రయత్నించింది. పంజగుట్టా ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర, ఆమె కారు ఆగింది. దానికి వెనక అతను కూడా తన పద్మినిని ఆపాడు. ఆ క్లీనర్ అమ్మాయి గాబరాపడడం చూడడం చాలా తమాషాగా వుంది. అతను కారు ఆపి, దిగి తమ దగ్గరకు వచ్చేస్తాడేమో అని ఆమెలో చాలా గుబులు కనపడింది.

ఆకుపచ్చ లైటు వెలిగి వాహనాలు కదలటం మొదలవగానే మారుతీ కారు ముందు వున్న అన్ని వాహనాలను రాంగ్‌సైడు నుంచి ఓవర్‌టేక్ చేస్తూ చాలా స్పీడుగా వెళ్లిపోవడంతో, రఘురామ్‌కు మళ్లీ ఆ కారు వెనుక చేరడానికి కొంచెం సమయం పట్టింది. ప్రయత్నమూ చేయాల్సివచ్చింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 3లో, ముఖఫంజా ఇంజనీరింగ్ కాలేజీ తరువాత, అతను ఆ మారుతీని ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్టు మళ్లీ నటించాడు. ఆ క్లీనరు అమ్మాయి సీటుపైన దాదాపు మోకాళ్లపై నిలబడి, తన తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూంది. డ్రైవరు అమ్మాయి కారును గాలిలో తీసుకపోతున్నట్టు నడుపుతుంది. రఘురామ్ వదులుతాడా? అతను కూడా ఆకారు వేనకే వున్నాడు. ఆ అమ్మాయిల ఇల్లు జూబ్లీహిల్స్‌లో వుండవచ్చునని అతను ఊహించాడు. కనీసం ఒక అమ్మాయి ఇల్లయినా చూద్దామని అతను మనసులో అనుకున్నాడు. వాళ్ల ఇళ్ళల్లోకి పోయి, తల్లిదండ్రులతో వారి గురించి ఫిర్యాదు చేయాలని అతనికి ఉద్దేశం లేదు. వాళ్లను వెంటాడుతున్నట్టు నటించడం అతనికి తమాషాగా వుంది అంతే!

ఎంతో భయంతో ప్రాణరక్షణార్థం శరవేగంతో పారిపోతున్న ఆ అమ్మాయిలు, వాళ్ల ఇంటికి కాదు, వెళ్లేది. ఆ కారు బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్ ముందు ఆగింది. ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ముగ్గురు కానిస్టేబుల్స్ స్టేషన్ బయటనే వున్నారు. ఆ ఇద్దరమ్మాయిలు కారులో నుంచి బయటకు దూకి సబ్ ఇన్‌స్పెక్టర్ దగ్గరకు పరుగెత్తికెళ్ళి ఊపిరి పీల్చుకోకుండా ఫిర్యాదు చేసింది ''ఆ కారులో వున్న గూండా మమ్మల్ని సికింద్రాబాదు నుంచి ఛేజ్ చేస్తున్నాడు. అతన్ని పట్టుకుని వెంటనే యాక్షన్ తీసుకోండి'' సబ్ ఇన్‌స్పెక్టరుకు చాలా సంతోషమయింది. ఇద్దరమ్మాయిలకు తన పవరేమిటో చూపించడానికి ఒక ఛాన్సు, ఒక యువకుడి వీపుపై తన చేతిని ఆడించడానికి ఇంకొక ఛాన్స్. ఆ సమయంలో రఘురామ్ కారు కూడా నిలబడి వుంది. ఒక కానిస్టేబుల్‌తో, ''ఆ వెనక కారు డ్రైవరును పట్టుకుని రమ్మని'' ఆ సబ్ ఇన్‌స్పెక్టర్ ఒక చిరునవ్వు, గంభీరత్వము కలగలిసిన ఆ ఆజ్ఞ వెలువరించేటప్పుడు అతని ముఖంలో కనుపించినది లేత ఎండలో జల్లు కురిసిన వాతావరణ విశేషములాంటి ఒక ప్రత్యేక భావం. దొంగ సొమ్ముతో ఆ దొంగ కూడా దొరికాడనే సంతోషంతో, మారుతీ కారు వెనుక నక్కి వున్న పద్మిని దగ్గరకు ధృత గతిలో వెళ్లిన ఆ కానిస్టేబుల్, ఆకస్మికంగా ఆగి మడమలు దగ్గరకు చేర్చి ఠక్ అని శబ్దంతో సెల్యూట్ చేసిన, ఆ సబ్ ఇన్‌స్పెక్టరుకు, ఆ ఇద్దరు అమ్మాయిలకు చాలా ఆశ్చర్యం కలిగింది... ఏ గొడవా రాకుండా వుండడానికి నాలుగయిదు అడుగులు ముందుకు వెళ్ళిన ఆ సబ్ ఇన్‌స్పెక్టర్ అడుగులు కూడా ''అటెన్షన్''వైపే దారితీశాయి. అతను కూడా స్మార్ట్‌గా ఒక సెల్యూట్ కొట్టడం జరిగింది. దానితో అమ్మాయిలు పూర్తిగా నీరుగారి పోయారు. రఘురామ్ మెల్లగా కారులోంచిదిగి, ఆ అమ్మాయిల దగ్గరకు వెళ్లాడు. అతని వెనకనే, అతి వినయంగా ఆ సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ కూడా నడిచివచ్చారు.

''వీళ్లేం చెప్పారు? నేను గూండా అనా? నేను ఎలాంటి గూండాయిజం చూపించానో వాళ్లనే కొంచెం అడుగు?'' అని రఘురామ్ సబ్ ఇన్‌స్పెక్టరుతో అన్నాడు.

''అమ్మా, వీరు ఇక్కడ అసిస్టెంటు పోలీసు కమీషనర్'' అని గాభరాతో ఆ సబ్ ఇన్‌స్పెక్టర్ చెప్పాడు.

''సారీ సర్, వుయ్ ఆర్ టెర్రిబ్లీ సారీ సార్'' అని డ్రైవరమ్మాయి విషణ్ణ వదనంతో చెప్పింది.

''వై? వుయ్? ఈ అమ్మాయి తప్పేమీ చేయలేదు కదా. మళ్లీ ఎందుకు ఆమెను కూడా ఇందులో కలుపుతున్నారు?'' అని సరదాగా ఆయన అడిగారు.

''సారీ సర్, అయామ్ సారీసర్'' ఆమె స్వయంగా సరిదిద్దుకుంది.

''మీరిలా ప్రవర్తిస్తే, బ్రతుకంతా సారీ చెప్పడానికే సరిపోతుంది.''

''ఒక తప్పు జరిగిపోయిందండీ. అప్పుడు నేను చాలా తొందరలో వున్నాను. సారీ ఒక్కసారి నన్ను క్షమించకూడదా?''

''సరిసరి నేను చూపించిన గూండాయిజం ఏమిటో చెబితే బాగుంటుంది. నాకు అది తెలియాలి గదా?''

''అదీ, అదీ, సార్ మా కారు ఛేజ్ చేయడం చూసి మాకలా అనిపించింది.''

''నేను ఎందుకు ఛేజ్ చేశానో మీకు తెలుసా? నా చిన్నప్పుడే నా తల్లి కనిపించకుండా పోయింది. ఎవరో చాకలి మనిషి పట్టుకునిపోయాడని తరువాత నాకు తెలిసింది.

ఆ ఇద్దరి అమ్మాయిల ముఖాల్లో అ విశ్వసనీయమైన ఆశ్చర్య భావం కదలాడింది. సబ్ఇన్స్పెక్టర్ కళ్లు బయటకు పొడుచుకొచ్చాయి. రఘురామ్ తన కథ ముందుకు సాగిస్తూనే వున్నాడు.

''తరువాత బంధువులు ఎవరూ లేకపోవడంవల్ల నేను చాలా కష్టపడి పైకొచ్చాను. జీవితంలో, కనీసం, ఒకసారైనా నా తల్లిని మళ్లీ చూడగలుగుతాననే ఆశాభావం నాలో ఎప్పుడూ వుండేది. కాని అమ్మను చూడాలనే తహతహనాలో ఇప్పటివరకూ పెరుగుతూనే వచ్చింది. ఆ సుదినమే కనక వస్తే, అందులో నా కెంత సంతోషం కలుగుతుందో మీరు ఊహించడం కూడా సాధ్యం కాదు.''

''అయితే, మీ అమ్మ ఈ రోజు కనబడిందా సార్?'' అని డ్రైవరమ్మాయి అడిగింది.

''ఏమ్మా నాతో తమాషా చేస్తున్నావా? ఇంతవరకు అసలు నేను ఎవరో అని ఎవరు కూడా కనుక్కోలేదు. ఈ రోజు అమ్మ స్వయంగా నన్ను గుర్తుపట్టి, కొడుకా అని పిలిచేటప్పుడు నాకు స్వర్గం లభించినట్లు అనిపించింది.''

రఘురామ్ ''అమ్మ'' అని ఎవరిని సంబోధిస్తున్నారని, అర్థంకాకుండా ఆడపిల్లలిద్దరూ వెనకవైపు, ఇరువైపులా చూసింతర్వాత పరస్పరం చూస్తూ నిలబడ్డారు. తరువాత ఆ డ్రైవరమ్మాయి అడిగింది.

''అమ్మ అని ఎవరిని పిలుస్తున్నారు సర్? మీ అమ్మ ఇక్కడే వుందా, లేక కలకంటున్నారా సార్?''

''అమ్మా, ఇంకా నాతో ఆడుకుంటున్నావా? ఎంతో ప్రేమతో అమ్మ నన్ను ''కొడుకా'' అని పిలిచేటప్పుడు, మీ జ్ఞాపకశక్తిపైన నా కెంతో ముచ్చట అనిపించింది. ఇంత కాలం నన్ను చూడకుండా ఈ రోజు నన్ను చూడగానే ఎలా గుర్తుపట్టగలిగావమ్మా?''

''ఏం సార్ మీరు ఇలా ప్రేలాపన చేస్తున్నారు? అసలు మీ అమ్మ ఎక్కడ వున్నారు?'' అని ఆ డ్రైవరమ్మాయి సంభ్రమంతో అడిగింది.

''అమ్మా, నన్ను క్షమించమ్మా. నన్ను గుర్తుపట్టి, కొడుకా అని పిలిచేటప్పుడు గూడా, ఆ క్షణంలో అమ్మను గుర్తుపట్టడం సాధ్యంకాలేదు. కొంతసేపు తర్వాతనే నాకు అర్థమయింది. అందుకే అమ్మ వెనక వెనకగా నేను పరుగెత్తికొచ్చాను. లేకపోయినా మా జాతి వాళ్లకు బుద్ధి మోకాళ్లలో వుంటుంది కదా. అదంతా పోనీయండి. ఇంతవరకు అమ్మ ఎక్కడ వుండేది? ఏ చాకలివాడు అమ్మను తీసుకొని పోయాడు? అమ్మను అతను చాలా బాధపెట్టాడా? అమ్మ నన్ను ఎంతో ప్రేమతో కొడుకా అని పిలిచి పారిపోయేసరికి, నాకు దుఃఖం కలిగింది. కనీసం, ఆ పిలుపు ఇంకొకసారి వినాలని ఆశిస్తూ మీ వెంట పరుగెత్తుకొచ్చాను. ముందు పిలిచినట్టు ఇంకొకసారి పిలువమ్మా!''

డ్రైవరమ్మాయికి, ఆమె స్నేహితురాలికి ఇప్పుడు భయం చాలా ఎక్కువయింది. సబ్ ఇన్‌స్పెక్టరుకయితే, తన అధికారికేమయినా పిచ్చెక్కిందా అన్న అనుమానం వచ్చింది. అతను మెల్లగా రఘురాం దగ్గరకు వెళ్లి చాలా భయంతో ''సర్, సర్ - -'' అని ఆగి ఆగి పిలిచాడు. అతని భయం గురించి దాదాపు తెలుసుకున్న రఘురాం సూటిగా అతని ముఖంలో చూసి ''నువ్వేం భయపడవద్దు. నాకు పిచ్చేమీ పట్టలేదు. అరగంట ముందు, ఈ మహిళామణి - నాతో ఎలా ప్రవర్తించిందో నీకు తెలుసా? సికింద్రాబాదులో ఒక ట్రాఫిక్ లైటు దగ్గర, నా కారు కొద్దిగా ఆగిపోతే, దానికి కోపం వచ్చి, నా కారు ఓవర్‌టేక్ చేస్తుండగా, నా మొహంలో చూసి నన్ను ''గాడిద కొడకా'' అని ఈమె పిలిచింది తెలుసా. అదీ కాకుండా, నేను గూండాయిజం చేసినట్టు కూడా ఈమె మీకు చెప్పింది కదా?''

''సర్, క్షమించరాని ఒక తప్పు నేను చేశాను. అయినా కూడా, చేతులు జోడించి నేను క్షమాపణ కోరితే, కొంచెమైనా దయ చూపించరా?'' అని ఆ డ్రైవరమ్మాయి, ఏడ్చి ఏడ్చినట్లుగా దయనీయంగా అడిగింది.

''లేకపోతే నిన్నేమయినా నేను నమిలేయబోతున్నానా? నన్ను గాడిద కొడుకు అని అనుకొని, నన్ను కొడుకా అని పిలిచే వ్యక్తిని, నేను అమ్మగా గుర్తించడంలో తప్పేమయినా వుందా? ముందు నన్ను కొడుకా అని పిలిచేది మనుష్య స్వరంలో. అలా కాకుండా,

అమ్మస్వంత స్వరంలో అంటే గార్దభరాగంలో నన్ను కొడుకా అని పిలిచిన తర్వాతనే ఈ రోజు అమ్మను వదులుతాను. ఇది నా మినిమమ్ డిమాండ్. ఇందులో ఎలాంటి ఎక్కువ తక్కువలు వుండడానికీ వీలులేదు.''

తర్వాత ఒక పది నిముషాల వరకు అభ్యర్థనలు, రోదనలు అన్నీ జరిగాయి. కానీ రఘురాం ఏ మాత్రం చలించలేదు. చివరకు క్లీనరమ్మాయి ''చూడవే, మనం కాలేజీలో మిమిక్రీ చేస్తున్నట్టు అనుకొని, ఒకసారి చేస్తే ఇక్కడ నుంచి తప్పించుకోవచ్చు గదా? కార్యం సాధించాలంటే, గాడిద కాళ్లు పట్టుకోవడంలో తప్పులేదు అని చెప్పినట్లు, నువ్వొకసారి ''ఆ-హుం, ఆహుం'' అని గాడిద ఏడ్చినట్లు ఒకసారి అనేసెయ్'' అని ఒక రహస్యాభిప్రాయం ఇవ్వడంతో, ఆ ఓవర్ స్మార్ట్ అయిన మారుతీ సారథి గింజుకుంటూ, గింజుకుంటూ ఆ ప్రోగ్రామ్ చేసి చూపించింది. రఘురాంనవ్వాడు.

వాళ్లను వదిలిపెట్టేముందు, వారి నామధేయాలు, చిరునామాలు లిఖితంగా తీసుకోవడం ఆ సబ్ ఇన్స్పెక్టర్ మరచిపోలేదు.